క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు



పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం సీజీఎం సుధీర్‌కుమార్ ఆదివారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్యేతో ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంపై పలు అంశాలు చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు సోమనాథ్ పాల్గొన్నారు.

శివాలయంలో క్షీరాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో భక్తులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు ప్రత్యేక పూజలు అనంతరం తీర్థప్రసాదాలు పూజారులు రమేశ్, మహేశ్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

రామగిరి: మండలంలోని రత్నాపూర్‌లో ఆది వారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రచార రథం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. సర్పంచ్ పల్లె ప్రతిమ, కేవీకే సాయిల్ సైంటిస్ట్ పిల్లి కిరణ్, ఏఎస్‌ఎం మన్నాల రాణి, ఆశావర్కర్లు స్వరూప, విజయలక్ష్మి, గద్దం సునీత, పంజా సునీత పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న విజయ్ దంపతులు

జ్యోతినగర్: అభయాంజనేయ స్వామి ఆలయానికి పొన్నం విజయ్–సుమలత దంపతులు విరాళం అందించారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న నవగ్రహాల ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నగ్రాశాలపైకు చెందిన పొన్నం విజయ్–సుమలత దంపతులు రూ.10,116 అర్చకులు వామన్ పంతులుకు అందించారు. డివిజన్ నాయకులు అబ్దుల్లా, రహీం, ఈదునూరి రవి, బొద్దున శ్రీనివాస్, శంకర్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సుల్తానాబాద్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. సమావేశానికి ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరుకానున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

చీరలు, దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందజేస్తున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లి, చిన్నరాతుపల్లి గ్రామాల్లో సెంచు కుటుంబాలకు ఆర్యవైశ్య మహిళలు ఆదివారం చీరలు, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. జగిత్యాల పట్టణానికి చెందిన వ్యాపారి రాచకొండ శ్రీనివాస్ జ్ఞాపకార్థం సతీమణి వనజ వీటిని నిరుపేదలైన సెంచు కుటుంబాలకు అందజేశారు. సర్పంచులు ఓరుగంటి కొమురయ్యగౌడ్, దాసరి నవలోక, దేశు భాగ్యమ్మ, ఈశ్వర్, సుజాత, విష్ణువర్ధన్, బొజ్జ రాజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అల్ఫోర్స్ అధినేత



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నరేందర్‌రెడ్డి

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును ఆదివారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే విజయరమణారావుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాష్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, కందుకూరి ప్రకాష్‌రావు ఉన్నారు.

వారసంత.. సమస్యల చింత

- వాన వస్తే బురద, ఎండాకాలం దుమ్ముమయం
- వసతులు కల్పించాలని చిరు వ్యాపారుల వినతి



వర్షంలో వారసంత నిర్వహణ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ వారసంతలో సమస్యల సంతతో వినియోగదారులు, వ్యాపారులు తిప్పలు పడుతున్నారు. వర్షం వస్తే బురద, ఎండొస్తే దుమ్ముతో సతమతమవుతున్నారు. మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం వారసంత నిర్వహిస్తారు. గ్రామం నడిబొడ్డున ఉన్న నీలకంఠం చెరువు సమీపంలో ఈ వారసంత ఉంది. వారం వారం ఇక్కడ నిర్వహించే ఈ సంతలో మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా పొరుగున ఉన్న ఓదెల, ముత్తారం మండలాల నుంచి వినియోగదారులు వస్తుంటారు. అలాగే వ్యాపారులు సైతం జమ్మికుంట, సుల్తానాబాద్, కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి, మంచిర్యాల, హుజురాబాద్ పట్టణాల నుంచి అన్నిరకాల వ్యాపార వస్తువులు విక్రయిస్తారు. ఇక్కడి సంతలో గ్రామపంచాయితీ వారే వ్యాపారుల వద్ద నుంచి రశీదులు అందించి పన్నులు వసూలు చేస్తారు. వ్యాపారులు సరుకులతోపాటు పరదాలు తెచ్చి నీడ కోసం ఏర్పాట్లు చేసుకుంటారు. వర్షం వస్తే రోడ్డంతా బురద కావడంతో సరుకులు పాడవుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. బురదలో నడిచేదెలా అని వినియోగదారులు వాపోతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సంతలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సరుకులు పాడవుతున్నాయి



వారానికోసారి నిర్వహించే ఈసంతలో చాలా గ్రామాల నుంచి వ్యాపారులు, వినియోగదారులు వస్తారు. వానకు, ఎండకు సరుకులు పాడైపోయి నష్టాల పాలవుతున్నాం. పట్టణాల్లో మాదిరి గద్దెలు, షెడ్లు వేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– సంపత్, కూరగాయాల వ్యాపారి

నిధులు మంజూరు చేయాలి

కాల్వశ్రీరాంపూర్‌లో ప్రతి శుక్రవారం అంగడి నిర్వహిస్తున్నాం. లైటింగ్ కోసం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నం. అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న ఈసంతలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతాం.

– ఆడెపు శ్రీదేవి, సర్పంచ్, కాల్వశ్రీరాంపూర్

చకచకా.. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ



పెద్దపల్లిరూరల్: ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి



సుల్తానాబాద్: ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు అర్హులెవరో తేల్చేందుకు ప్రజాపాలన గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చకచకా సాగుతోంది. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రజలనుంచి 2,69,461 దరఖాస్తులు స్వీకరించారు. అందులో రేషన్‌కార్డులతో పాటు ఇతర దరఖాస్తులు 38,120 వరకు ప్రజల నుంచి అందాయని అధికార వర్గాలు వెల్లడించాయి. అన్ని మండలాల్లో ప్రక్రియ కొనసాగుతుండగా తప్పులు దొర్లకుండా వేగవంతంగా పూర్తి చేయాలంటూ జిల్లా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈనెల 17కల్లా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తామని డీపీవో చంద్రమౌళి తెలిపారు.

సుల్తానాబాద్: జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. గత నెల 28 నుంచి ప్రారంభమైన ప్రజాపాలన శనివారంతో ముగిసింది. కార్యక్రమ పర్యవేక్షణకు ప్రభుత్వం నియమించిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శ్రీదేవసేన ఎలిగేడు మండలం లాలపల్లిలో సందర్శించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్ అరుణశ్రీ, విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, ఠాగూర్ మక్కాన్‌సింగ్ దరఖాస్తులు స్వీకరించారు. అధికారులకు సిబ్బందికి పలు రకాల సూచనలు చేశారు.

జిల్లాలో 14 మండలాలు, 267 గ్రామపంచాయతీలు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, మున్సిపల్ రామగుండం కార్పొరేషన్‌లో ఉన్నాయి. గత నెల 28 నుంచి ఈనెల 6 వరకు వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ పరిధిలోని వార్డులు, గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తులను సీఎస్ ఈనెల 17లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో కారోబార్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు ఇతర సిబ్బందితో ఆన్‌లైన్ చేయించడం ప్రారంభించారు. రాత్రి వరకు సిబ్బందిని పని చేయించేలా అధికారులు కార్యాలయంలో ఉంటూ పనిని వేగవంతంగా చేస్తున్నారు.

సీఅండ్ఎండీకి శుభాకాంక్షలు

రామగిరి: నూతన సీఅండ్ఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎన్.బలరాంనాయక్‌ను ఆదివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గని కార్మికులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గని కార్మికులు ఇంద్రాసేనారెడ్డి, సురేశ్, సతీశ్‌రెడ్డి, కాసు అనిల్‌కుమార్, విష్ణు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీఏ కార్మికులు

ఓదెల రైల్వేస్టేషన్లో సౌకర్యాలు కల్పించండి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలోని ఓదెల రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు అదనంగా సౌకర్యాలు పెంచాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు తాటికొండ వెంకటేశ్వర్లు, తాటికొండ కృష్ణమాచారి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కాచిగూడ స్వగృహంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ప్రయాణికుల రద్దీతో గంటల తరబడి గేట్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంటనే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. ఓదెల రైల్వేస్టేషన్‌లో అదనంగా సౌకర్యాల మెరుగుకోసం రైల్వేశాఖమంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని కేంద్రమంత్రి వారితో సానుకూలంగా చెప్పినట్లు వారు తెలిపారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ



పెద్దపల్లిరూరల్: అక్షింతలు పంపిణీ



సుల్తానాబాద్‌లో..



రామగిరి: గోకుల్‌నగర్‌లో ఊరేగింపు



పాలకుర్తి: వేంనూర్‌లో..

ఫెర్టిలైజర్‌సిటీ: అయోధ్య రాముడి అక్షింతలు ప్రతి ఇంటికీ చేరాలని ఆదివారం వీర అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి శాంతినగర్, సంజయ్ గాంధీనగర్, రాజీవ్‌నగర్, ఇందిరానగర్‌లలో ఇంటింటికీ పంపిణీ చేశారు.

సుల్తానాబాద్: పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని చైతన్యకాలనీ, సురభికాలనీ తదితర ప్రాంతాల్లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ చేశారు.

పాలకుర్తి: మండలంలోని వేంనూర్ గ్రామంలో శ్రీరామ జన్మభూమి అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు.

రామగిరి: మండలంలోని కల్వచర్ల పంచాయతీ పరిధిలోని గోకుల్‌నగర్‌లో అయోధ్య రాముని అక్షింతల ఊరేగింపు నిర్వహించారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

రామగిరి: బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్‌ను ఆదివారం నాగెపల్లి గ్రామంలోని తన నివాసంలో ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు మద్రి ఓదెలుయాదవ్, సాంబయ్య, పెద్ది సమ్మయ్య, మల్లికార్జున్, మోహన్‌తో పటు తదితరులు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

పెద్దపల్లిరూరల్: హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందించాలని వైద్యుడు సాయికుమార్, ధర్మేందర్ కోరారు. పెద్దపల్లిలో ఆదివారం సమావేశమయ్యారు. జన్యులోపంతో పుట్టుకతో సంక్రమించే ఈ అరుదైన వ్యాధిబారిన పడ్డ జిల్లా ప్రజలకు అవసరమైన మందులను ప్రభుత్వమే అందించాలని కోరారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో మందులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా నర్సయ్య

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మట్ట నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించుకొని నూతన యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా మట్ట నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పోలుదాసరి సంపత్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ తాజ్, సహాయ కార్యర్శిగా మేడ తిరుపతి, కోశాధికారిగా జంగపల్లి తిరుపతి ఎన్నుకున్నారు.

ప్రభుత్వపరంగా సహకారం అందించండి



శుభాకాంక్షలు తెలుపుత్ను నాయకులు

గోదావరిఖని: ప్రభుత్వపరంగా సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలు, ఇతర సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఆదివారం దుర్గానగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు దొంత సాయన్న, ఉప్పులేటి తిరుపతి, సింగరేణి విశ్రాంత డిప్యూటీ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు పాల్గొన్నారు.

రెండునెలల్లో ఎత్తిపోతల ప్రారంభానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండం: రాబోయే రెండునెలల్లో బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల ద్వారా అంతర్గాం మండల పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని, పెండింగ్‌లో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ అమలుకు చర్యలు చేపడతానని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదసభకు హాజరై మాట్లాడారు. సాగునీటి సమస్యలు, పునరావాస ప్యాకేజీ పరిహారం సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఆయనను సత్కరించారు. కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి పెంద్రు హన్మాన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, ప్రతినిధులు సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, కొదురుపాక పవన్, జూల లింగయ్య పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు ఆలయ అర్చకులు రుద్రభట్ల సత్యనారాయణ, వామన్ వేద మంత్రాలతో స్వాగతం పలికారు. ఆలయంలో నూతనంగా నవగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ వెంగల పద్మలత, ఎండీ అబ్దుల్లా, రహీం, వెంగల బాపు, శాబొద్దీన్, శంకర్, శ్రీనివాస్, ఈదునూరి రవి ఉన్నారు.

ఉద్యమకారులకు అండగా కాంగ్రెస్ సర్కార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: ప్రత్యేక రాష్ట్రసాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గత పాలకులు విస్మరిస్తే.. అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయడంతో పాటు వారికి అండగా నిలిచేలా చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఉద్యమకారుల సంఘం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, గుండేటి ఐలయ్య, పార్లమెంట్ కన్వీనర్ శంకర్‌తో కలిసి మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో నమోదైన కేసులన్నింటినీ ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. నాయకులు రాజేశం, నారాయణరెడ్డి, కృష్ణ, ఆంజనేయరావు, రాజయ్య, సురేందర్, మస్రత్, ధనుంజయ, చంద్రకళ ఉన్నారు.

స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో..

పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో గోదావరిఖని జట్టు ప్రథమ, పెద్దపల్లి జట్టు ద్వితీయ బహుమతిని సాధించగా ఎమ్మెల్యే విజయరమణారావు బహుమతి ప్రదానం చేశారు. నాయకులు రంగు శ్రీనివాస్, ప్రకాశ్‌రావు, వెంకటేశ్వర్లు, రాజు, సదానందం, రవీంద్రచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జిల్లా అడిషనల్ కోర్టును సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లో అడిషనల్ జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును న్యాయవాదులు కలిసి విన్నవించారు. ఆదివారం సుల్తానాబాద్‌లో కలిసి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కోర్టును పెద్దపల్లి మండలం కన్నాలలో కాకుండా సుల్తానాబాద్ కోర్టులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.బాలకిషన్ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజం, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు ప్రకాశ్‌రావు, అన్నయ్యగౌడ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాలు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొడ్డె స్వామి తెలిపారు. ఆదివారం కొలనూర్ గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ, సెంట్రింగ్ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. తాపీమేస్త్రీలు, సెంట్రింగ్ వర్కర్లు సుబ్బారాయుడు, హుస్సేన్, సంతు, అనిల్, మహేశ్, రాజేశ్, కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ డోజో కుంగ్‌ఫూ కరాటే పోటీలు



విజేతలతో కోచ్ రాజమల్లు

ధర్మారం: ధర్మారం వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం డ్రాగన్ స్వార్డ్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్ డోజో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మూడు జిల్లాల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన కట్ట వినయ్ బ్లాక్‌బెల్టు కటాస్ విభాగంలో చాంపియన్‌షిప్ సాధించినట్లు కోచ్ మాస్టర్ రాజమల్లు తెలిపారు. బాలికల బ్లాక్‌బెల్టు కటాస్ విభాగంలో నడిమెట్ల ఇందిర ప్రియదర్శిని (నందిమేడారం) సాధించారు. అదేవిధంగా కలర్ బెల్ట్ కటాస్ విభాగంలో మనస్విత(ధర్మారం) చాంపియన్‌గా నిలువగా కటాస్ విభాగంలో సత్య త్రివేద్ చాంపియన్‌షిప్ సాధించినట్లు కోచ్ వివరించారు.

కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టు



బెల్టులు సాధించిన విద్యార్థులు

మంథని: మంథనిలోని లక్ష్మీభారతి హాల్‌లో షోటోకాన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు ఆధ్వర్యంలో 50మంది విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. అత్యధిక ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 18 జూనియర్ రెడ్, 20 ఎల్లో బెల్ట్, ఆరు గ్రీన్, 3 పర్పుల్, 3 బ్రౌన్ బెల్టులు ప్రదానం చేసినట్లు నాగరాజు తెలిపారు. అలాగే న్యూఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో 17ఏళ్ల లోపు 35కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన బేర ఆధిత్య తేజని సన్మానించారు. షోటోకాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, మంథని సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



రత్నాపూర్‌లో అయ్యప్ప పడిపూజ

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామంలోని ఎంపీటీసీ దర్ముల‌రాజ సంపత్ ఇంట్లో అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి 18 మెట్లలో భాగంగా ఒక్కో మెట్టుకు గురుస్వాములు పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

బీఆర్‌ఎస్ భూకబ్జాలపై విచారణకు డిమాండ్

ధర్మారం: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అనుచరులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకొని కబ్జాలు చేసిన ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని కాంగ్రెస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ధర్మారంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు దేవి జనార్దన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్ చైర్మన్ కాడె సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్ మాట్లాడారు. లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడని బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కాంపెల్లి రాజేశం, ఈదుల శ్రీనివాస్, ఎల్లయ్య, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.